# వాస్తో నారాయణ హరి

-ఎ.బదరీ నారాయణ

శ్రీనివాసులు ఒక చిన్న ప్రభుత్వ ఉద్యోగి. అద్దె ఇంటిలో వుంటూ అనేక ఇక్కట్లు పడుతున్న జీవి. భయం, భక్తి, వాస్తు, సెంటిమెంట్స్ పుష్కలంగా ఉన్న మధ్య తరగతి కుటుంబీకుడు.

ఈమధ్యనే జీతాలు పెరగడంతో ఒక సొంత ఇల్లు కట్టుకోవాలి అని, తన చిరకాల వాంఛ తీర్చుకోవాలి అని ఒక గట్టి నిర్ణయం తీసుకున్నాడు. దానివలన ఇన్‌కంటాక్స్ నుంచి కూడా తప్పించుకో వచ్చు అని తెగ ఆలోచించి అర్జంటుగా ఇల్లు కట్టేయాలి అని నిర్ణయించుకున్నాడు.

ఇల్లు కట్టడంలో అనుభవం ఎవరికి ఉందా, ఎవరిని సంప్రదించాలా అని తెగ ఆలోచించి చివరికి ఈమధ్యనే ఇల్లు కట్టిన ఆంజనేయులుని కలిసాడు.

"ఓస్ ఇంతేనా గురూ! నేను ఇల్లు కట్టినప్పుడు సరైన వాస్తు పండితుడిని కలవలేక చాలా ఇబ్బంది పడ్డాను. నీ విషయంలో అలా జరగకుండా స్థలం గిలం, వాస్తు గీస్తు అన్నీ నేనే చూస్తాను, కంగారుపడకు'' అన్నాడు.

అన్నట్లుగానే మంచి స్థలం చూసి శ్రీనివాసులు చేత కొనిపించాడు.

ఇంకేం ఇంక ఇంటి ప్లాను వేయించాలి, మంచి వాస్తు పండితునికి స్థలం, వాస్తు అన్నీ చూపించాలి అనుకున్నారు.

మంచి వాస్తు పండితుడు ఎవరు ఉన్నారు? అని తెగ ఎంక్వయిరీ చేసి చివరికి వాస్తుబ్రహ్మ, వాస్తుజ్ఞాని, వాస్తు శిఖామణి అని తెగ బిరుదులు తగిలించుకున్న ఒక స్వామీజీని కలిసారు.

ఆ స్వామీజీని కలవాలి, ఇంటి స్థలం దగ్గరకు తీసుకువెళ్లాలీ అంటే రానుపోను కారు ఖర్చులు కాక ఆయనకి ఇంత, ఇల్లుని చూడాలి అంటే ఇంత అని చాలా పెద్ద లిస్టు చెప్పారు ఆయన శిష్యగణం.

అది చూసి పాపం శ్రీనివాసులు గుండె గుభేల్ మంది.

కానీ తప్పదుకదా స్వామీజీని కలిసాడు. ఆయన ఉపన్యాసం విని తరించాడు.

ఆయన తన ఉపన్యాసంలో వాస్తులో తనకిగల అపార జ్ఞానం, ప్రావీణ్యం, వాస్తు గురించి ఆయన చేస్తున్న ప్రయోగాలు అవీ ఇవీ అన్నీ వివరించాడు.

తరువాత చిద్విలాసంగా నవ్వి శ్రీనివాసులుని కరుణించి ఒక నెల తరువాత అప్పాయింట్‌మెంట్ ఇచ్చారు.

శ్రీనివాసులు ఎగిరి గంతేసి "అంతవరకూ ఓపిగ్గా వేచి చూస్తాను. ఆయన చూసాక ఇల్లు కడతాను. నిజంగా నేనెంతో అదృష్టవంతుడిని'' అని చెప్పి ఆనందంతో ఇల్లు చేరాడు.

ఈ నెలలో రోజూ కాకపోయినా తరచుగా స్వామీజీ ఆశ్రమం అనే ఎయిర్ కండిషన్డ్ బంగళాకి వెళ్లి ఆయన దర్శనం చేసుకుని, చెప్పినది విని తరించి ఇంటికి వచ్చి తెగ ఆలోచించి చివరికి ఎప్పుడో తెల్లవారుఝామున నిద్రపోతున్నాడు.

★★★

తెల్లవారింది.

శ్రీనివాసులు స్వామీజీ ఆశ్రమం చేరాడు. అక్కడ స్వామీజీ ఆసీనులు అయి చాలా సీరియస్‌గా, గంభీరంగా ఉపన్యాసం ఇస్తున్నారు.

"శిష్యులారా! నేను ఒక సత్యం, ఒక అద్భుతమైన నిజం కనుగొన్నాను. అది మనుష్యులకి వస్తున్న రోగాలు, రొచ్చులు, బాధల గురించి ఒక నిజం తెలుసుకున్నాను. అది మానవ శరీర నిర్మాణం పూర్తి వాస్తు విరుద్ధంగా నిర్మితమై ఉంది. అందుకని 'నా మానవ శరీర వాస్తు' అనే అద్భుత గ్రంథ ప్రయోగం అనుసరించి కొన్ని అవయవాలను మార్పు చేయవలసి వచ్చింది. ఈశాన్యంలో బరువు ఎలా ఉండకూడదో అలా మన ఎడమ పక్కన బరువుగా గుండె ఉండకూడదు. అలాగే కొన్ని మార్పులు చేర్పులు చేయాలి. అందుకోసం నేను చాలా స్టడీ చేసి మానవ శరీర నిర్మాణం ఎలా ఉండాలి, ఏ అవయవం ఎక్కడ ఎలా ఉండాలో డ్రాయింగ్స్‌తోసహా వ్రాసి దానికి ఒక పుస్తక రూపం ఇచ్చాను. ఇది ప్రయోగాత్మకంగా ఒకరిపై ప్రయోగించాలి. నేను అనుకున్నట్లుగా అవయవ మార్పులు చేసి ఒక కొత్త వ్యక్తిని తయారు చేస్తాను.

ఇంక ఆ వ్యక్తికి శరీర వాస్తు మార్పువల్ల రోగం, రొచ్చు, బాధలు అనేవి వుండక ఎంతోకాలం ఆనందంగా అలా జీవిస్తూ ఉంటాడు. కనుక ఆ ప్రయోగం ఎవరిమీద చేయాలా అని ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను'' అని గట్టిగా ఊపిరి తీసుకుని వదిలారు.

భక్తులందరూ ఆనంద, ఆశ్చర్య సంభ్రమాలకు లోనయ్యారు. ఆయన ఏం చెబుతారా అని ఊపిరి బిగబట్టి, చెవులు రిక్కించి ఎంతో ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నారు.

స్వామీజీ కొంచెంసేపు అందరినీ సస్పెన్స్‌లో వుంచి తేరిపార అందరినీ చూసి చివరికి ఇలా కొనసాగించారు.

"ఈ బృహత్తర ప్రయోగానికి మన శ్రీనివాసులుని ఎంచుకున్నాను. ఈ అదృష్టం ముందుగా అతనికి వచ్చింది'' అన్నారు.

వెంటనే దానికి కావాల్సిన ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి.

శ్రీనివాసులును దగ్గరగా పిలిచి "నాయనా! అవయవ మార్పిడి చేసి నిన్ను చిరంజీవిని చేస్తాను రా నాయనా'' అని పిలిచారు.

వెంటనే స్వామీజీ శిష్యులు శ్రీనివాసులును లోపలికి మోసుకుని పోయారు.

శ్రీనివాసులును స్వామీజీ శిష్యులు ఒక బల్లపై వెల్లకిలా పడుకోబెట్టారు.

స్వామీజీ తను వ్రాసిన పుస్తకం చూస్తూ పెద్ద కత్తి, కటారు, మందు మాకు తీసుకుని గదిలోకి వచ్చి, శ్రీనివాసులు తల నిమిరి చిన్నగా చిరుమందహాసం చేసి కత్తిని పైకి ఎత్తారు గుండెలను చీల్చడానికి.

ఒక పెద్ద పొలికేక.

ఇంటిల్లిపాదీ హడిలిపోయి శ్రీనివాసులు గదికి

పరుగు పరుగున వచ్చారు.

శ్రీనివాసులు మంచంమీద పడుకుని గిజగిజ కొట్టుకుంటూ "వద్దు...వద్దు" అని కెవ్వుకెవ్వున అరుస్తున్నాడు.

అది చూసి వాళ్ల బామ్మ "పిరికి కుంక! ఏదో కల వచ్చి జడుసుకున్నాడు" అనుకుని బిందెడు నీళ్లు శ్రీనివాసులు మీద గుమ్మరించింది.

వెంటనే లేచి కూర్చున్నాడు శ్రీనివాసులు.

"అమ్మో... ఇది కలా? నిజం అనుకుని భయపడి చచ్చాను" అని తేరుకున్నాడు.

అతనికి నిన్న రాత్రి ఆంజనేయులు చెప్పిన సంగతులు గుర్తుకువచ్చాయి.

"ఇంటి గురించి వాస్తు పండితులకి చూపిస్తే ఒకడు డాబా మెట్లు వంకరగా ఉన్నాయి, అది పడగొట్టించి మళ్లీ కట్టించమన్నాడు. పడగొట్టించి కట్టినందుకు పదివేలు ఫట్. ఒకడికి మరొకరికీ పొంతన లేదు. తమ చంటాడి కడుపు నొప్పికి, తన బామ్మ కీళ్లనొప్పులకి కూడా వాస్తు లంకె పెట్టి తన చేత లక్షలు తగలబెట్టించాడు. కనుక గురూ! నువ్వు ఈ ఒక్క స్వామీజీనే నమ్ము. ఈయన నీకు దొరకడం నీ అదృష్టం. లేదా నాలాగే మునిగిపోతావు" అన్నాడు.

ఇప్పుడు శ్రీనివాసులు ఆలోచనలో పడ్డాడు, 'వాస్తును నమ్మితే ఈ శరీర మార్పు కలలాగే ఉంటుందా? అసలు దీనిని ఇంతలా నమ్మవచ్చా? ఏం చేయాలి?' అని.

★

